

ఎస్ఎస్‌బిఎన్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని వినతి

అనంతపురం : అనంతపురంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో జరిగిన అక్రమాలపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎ ఆధ్వర్యంలో శుక్రవారం హయ్యర్ ఎడ్యుకేషన్ హేమచంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు వేమన్న, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, అబ్దుల్ ఆలం మాట్లాడుతూ ఎస్-ఎస్‌బిఎన్ యాజమాన్యంపై రోజూ వార్తా పత్రికల్లో కథనాలు రావడంతోపాటు పోలీస్‌స్టేషన్‌లో కేసులు సైతం నమోదు చేశారన్నారు. విద్యార్థులకు విద్య బోధించాల్సిన యాజమాన్యం ఇలా అవినీతి అక్రమాల్లో కూరుకుపోవడం బాధాకరమన్నారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకార వేతనాలు చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి 2019 నుంచి విడుదలైన నిధుల వినియోగంపై విచారించాలని, ప్రస్తుత కళాశాల పాలక మండలిని రద్దు చేయాలని, ఎఫ్ఐఆర్‌లో పేర్లు నమోదైన వారిని కళాశాల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రములో ఐసా నాయకులు అఖిల్, ప్రతిభా భారతి, రుక్మిణి, రజియా, మహేష్, పవన్ పాల్గొన్నారు

సొంతింటి కల నెరవేరేనా..?



హిందూపురం పట్టణ సమీపంలోని కొటిపి గ్రామ సమీపంలోని లేఅవుట్‌లో పునాదులకే పరిమితమైన ఇళ్లు

సామాన్యుడి కలల సౌధం కలగానే మిగిలిపోతోంది. ఏళ్లు గడుస్తున్నా జగనన్న లేఅవుట్లలో నివాసాల నిర్మాణాలు పునాదులకే పరిమితం అవుతున్నాయి. ఎన్నికల తరుణం కూడా దగ్గరపడుతోంది. దీంతో ఈ ఎన్నికలనాటికైనా పేదల సొంతింటి కల నేరవేరుతుందా? అని అనంతపురం ఉమ్మడి జిల్లాలోని పేదలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

జగనన్న లేఅవుట్లలో కనిపించని కనీస సౌకర్యాలు

సమీక్షలతోనే సరిపెడుతున్న అధికారులు, పాలకులు

పునాదులకే పరిమితమైన ఇళ్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో గత 15 సంవత్సరాలుగా పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టణ సమీపంలోని కొటిపి గ్రామ సమీపంలో భూ సేకరణ చేపట్టి ఒక నివాస గృహానికి రెండు సెంట్లు చొప్పున 3600 మంది లబ్ధిదారులకు పట్టాలను మంజూరు చేశారు. అయితే నివాస గృహాలకు కేటాయించిన భూమి నల్లరేగడి కావడంతో ఎప్పటికైనా ప్రమాదమని తెలిసి లబ్ధిదారులు మక్కువ చూపలేదు. అనంతరం 2014లో జరిగిన ఎన్నికల సమయంలో పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పి టిడిపి అధికారంలోకి వచ్చింది. అయితే ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంలో ఇదే స్థలంలో అపార్ట్‌మెంట్స్ నిర్మాణాలు చేసి ఇస్తామని చెప్పి పనులు సైతం ప్రారంభించారు. అయితే ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. అక్కడ కనీస సౌకర్యలు కల్పించక పోవడంతో అవి కూడా నిరుపయోగంగా మారాయి. అనంతరం 2019 ఎన్నికల సమయంలో వైసిపి సొంతిల్లు లేని పేదలందరి కలలు నెరవేరుస్తామంటూ ఊదరగొట్టింది. అధికారం చేపట్టి మూడు సంవత్సరాలు పూర్తిఅయినా హిందూపురం పురపాలక సంఘంలో మూడు ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టలేదు.

గృహ నిర్మాణశాఖ అధికారుల లెక్కల మేరకు పురపాలక సంఘంలో సుమారు 6400 మందికి ఇంటి స్థలాలను కేటాయించాలని ఎంపిక చేశారు. ఇందులో 4600 మందికి కొటిపి లేఅవుట్‌లో ఇళ్లు కేటాయించారు. మిగిలిన వారందరికీ రూరల్ మండలం మణేసముద్రం వద్ద ప్రత్యేక లేఅవుట్ సెంటు స్థలాన్ని కేటాయించారు. సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేయాలంటూ లబ్ధిదారులు చేతులెత్తేశారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల నిర్మాణాలు చేసి ఇస్తామని గుత్తేదారులకు అప్పగించారు. గుత్తేదారులు 18 మాసాల నుంచి 4600 ఇళ్ల నిర్మాణాలకు గాను ఇప్పటివరకు కేవలం 700 ఇళ్ల నిర్మాణాల కోసం పునాదులు మాత్రమే వేశారు. ఇంకా 3900 పునాదుల నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఇప్పటి వరకూ ఒక్క నివాసం కూడా మొదలుకాని లేఅవుట్లు జిల్లాలో అనేకం దర్శనమిస్తుండడం ఈ లెక్కల్లో డొల్లతనాన్ని బయటపెడుతోంది.

కారణాలు అనేకం..

వాస్తవానికి అధికశాతం మంది నివాసాలు మొదలు పెట్టక పోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. కరోనా సమయం నుంచి ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండడం, నిర్మాణ సామగ్రితో పాటుగా కూలీల రేట్లకు రెక్కలు రావడం ప్రధానంగా కనిపిస్తోంది. ప్రభుత్వం తొలుత గృహ నిర్మాణదారులకు మూడు ఆప్షన్లను ఇచ్చింది. వినియోగదారుడు తనకు కావాల్సిన విధంగా నిర్మించుకుంటే దానికి తగిన విధంగా బిల్లులు మంజూరు చేయడం ఒకటి కాగా, ప్రభుత్వం ఇచ్చిన మెటీరియల్‌తో ఇంటి నిర్మాణం చేపట్టేలా రెండో ఆప్షన్ ఉంది. ఇక మూడోది ప్రభుత్వమే ఇంటిని నిర్మించి అప్పగించేలా అంగీకార పత్రాలను కూడా తీసుకుంది. ఇందులో దాదాపుగా 80 శాతం మందికి పైగా ప్రభుత్వమే ఇల్లు నిర్మించి తమకు అప్పగించేలా వినియోగదారులు అంగీకరించారు. దానికి గానూ వాలంటీర్లు చెప్పిన విధంగా బ్యాంకుల్లో ఖాతాలను కూడా తెరిచారు. కానీ ఇది జరిగి నెలలు గడుస్తున్నా దానికి సంబంధించిన పనులు ఒక్కటి కూడా ప్రారంభం కాలేదని చెప్పాలి. ఆ తర్వాత మూడో ఆప్షన్‌ను ప్రభుత్వం తొలగించింది. దీంతో చాలామంది లబ్ధిదారులు అసలు తమకు ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసిందనే విషయాన్ని కూడా మర్చిపోయే పరిస్థితి నెలకొంది. దానికి తోడు గృహాలకు సంబంధించి పదేపదే సమావేశాలను నిర్వహించడం కూడా లబ్ధిదారులకు విసుగును తెప్పిస్తోంది.

అధ్వానంగా లేఅవుట్లు..

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని చాలా లేఅవుట్లు బురదమయంగా మారాయి. కొన్ని లేఅవుట్లలో నీరు చేరి చెరువులను తలపించాయి. రోడ్లు కూడా బురదమయంగా మారాయి. చాలాచోట్ల లేఅవుట్లలో ఇంకా రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ వంటి పనులు సాగుతున్నాయి. ఈ పనులను పూర్తి చేసిన తర్వాతే నివాసాల పనులను చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

బంగారమైన ఇసుక..

హిందూపురం పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఇసుక బంగారమయింది. దీంతో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక పూర్తి స్థాయిలో దొరక్క లబ్ధిదారులతో పాటు గుత్తేదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో చర్చించారు. అయినప్పటికీ అధికారం యంత్రాంగం పూర్తిస్థాయిలో ఇసుకను సరఫరా చేయడంలో విఫలమయింది. పూర్తిస్థాయిలో ఇసుక లభ్యం కాకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావడం లేదు.

ఒత్తిడి భరించలేకపోతున్న అధికారులు..

పాలకులు, ఉన్నతాధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోతే లబ్ధిదారులు ముందుకు రావడం లేదని, ఇసుక పూర్తిస్థాయిలో లభ్యం కావడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనాలను సైతం పెంచి లబ్ధిదారులకు ఇస్తే తప్ప వారు నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకురారని గృహ నిర్మాణ శాఖ అధికారులు వాపోతున్నారు. అయితే ఈ విషయాలను సమీక్ష సమావేశంలో అధికారులకు చెప్పలేకపోతున్నారు. అధికారుల ఒత్తిడికి చాలామంది అధికారులు సెలవులపై, బదిలీలపై వెళ్లడానికి సిద్ధమవుతున్నారు.



దుకాణాల ముందే మద్యం తాగుతున్న మందుబాబులు... మూతపడ్డ దుకాణాలు

మున్సిపల్ కాంప్లెక్స్‌లో మద్యం షాపు

మందుబాబుల చేష్టలతో 12 దుకాణాలు మూత

తొలగింపునకు నోటీసులు ఇచ్చినా స్పందించని వైన్‌షాపు నిర్వాహకుడు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న మున్సిపాల్టీ వాణిజ్య సముదాయంలోని గదిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంతో పక్కనున్న దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్స్‌లో 20 దుకాణాలు ఉన్నాయి. ఒక్కో గదికి రూ.1470 అద్దె మున్సిపాలిటీకి చెల్లించేలా 20 మంది దుకాణాదారులు వ్యాపారాలు ప్రారంభించారు. మున్సిపాలిటీ చట్ట ప్రకారం వాణిజ్య సముదాయాల్లో మద్యం, మాంసం దుకాణాలు ఏర్పాటు చేయరాదు. నిబంధనలను బేఖాతరు చేస్తూ ఓ దుకాణ నిర్వాహకుడు రెండేళ్ల క్రితం వైన్ షాపుకు సబ్ లీజ్‌కు ఇచ్చాడు. వైన్ షాపుకు వచ్చేవారు మద్యం కొనుగోలుచేసి పక్కనే ఉన్న దుకాణాల ఎదురుగా బైఠాయించి సేవిస్తున్నారు. కేకలు పెడుతూ.. అల్లరి చేస్తూ గొడవ పడుతున్నారు. బాటిళ్లను అక్కడే పడేస్తున్నారు. మరికొందరు పగలగొడుతున్నారు. దుకాణాల ముంతదు అపరిశుభ్రం చేయడంతో పాటు వెలికి చేష్టలకు పాల్పడుతున్నారు. దీంతో వైన్ షాపు పక్కన ఉన్న దుకాణాలకు ప్రజలు వ్యాపారానికి రావడం లేదు. వ్యాపారాలు లేకపోవడంతో దుకాణాలను మూసివేశారు. సమస్యను దుకాణదారులు ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యం. నెలనెలా అద్దెలు చెల్లించని పక్షంలో మున్సిపల్ అధికారులు జరిమానా విధిస్తున్నారని వాపోతున్నారు. వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగించే తాము రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైన్ షాపు తొలగించాలని నిర్వాహకుడికి నోటీసులు ఇచ్చి బాడుగను రద్దు చేశామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయినా అతను స్పందించడం లేదని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించాలని బాధిత దుకాణదారులు కోరుతున్నారు.

గొర్రెల పెంపక కేంద్రం స్థలం కేటాయింపులో మార్పు

పరిశీలన అనంతరం అహుడాకు కేటాయించిన భూమి మార్పు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గొర్రెల పెంపక కేంద్రంలోని స్థలాన్ని అహుడాకు కేటాయింపుకై స్థల పరిశీలనకు అధికారులు శుక్రవారం విచ్చేశారు. పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేందర్, సత్యసాయి జిల్లా కలెక్టరు బసంత్‌కుమార్‌లు కేంద్రాన్ని పరిశీలించారు. 1959లో ఏర్పాటైన ఈ కేంద్రానికి 600 ఎకరాల భూమిని ఆనాడు కేటాయించియున్నారు. ఇప్పుడు స్థలాన్ని క్రమక్రమంగా ఇతర అవసరాలకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం చేస్తూ వెళ్తోంది. ఇది వరకే వైద్య కళాశాలకు ఇందులో నుంచే 50 ఎకరాలు కేటాయించారు. తాజాగా మరో 51.52 ఎకరాలను అహుడాకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం చేసింది. అయితే గొర్రెల పెంపక కేంద్రం కోసం కేటాయించిన ఈ స్థలాన్ని ఇతర అవసరాలకు కేటాయించడంపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసియున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై క్షేత్రస్థాయి పరిశీలనకు పశు సంవర్ధక శాఖ డైరెక్టరు, జిల్లా కలెక్టరు విచ్చేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ అధికారులు కూడా అహుడాకు ముందుగా అనుకున్న ప్రకారం భూమిని కేటాయిస్తే మధ్యలో పెంపకం కేంద్రం గోడౌన్, ఫార్మ్‌కు మధ్య రహదారి కూడా లేకుండాపోతుందని తెలిపారు. ఏదైనా అవసరమైన దాణా సరఫరా చేసుకోవాలంటే ప్రధాన రహదారిపైకి వచ్చి తిరిగి తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా ఇప్పుడు కేటాయించిన భూమి మొత్తం గుట్టలతో కూడి ఉండటంతో అహుడా దాన్ని అభివృద్ధి చేయడానికి నిధులు అదనంగా ఖర్చు అవనున్నాయన్న అంశాన్ని అధికారులు భావించారు. ఇప్పుడు కేటాయించినది కాకుండా ఇది వరకు వైద్య కళాశాలకు కేటాయించిన భూమి పక్కనే, అదే సర్వే నంబరులో ప్రధాన రహదారికి ఆనుకునివున్న 20 ఎకరాలు అహుడాకు కేటాయిస్తే వారికి ప్రయోజనకరంగా ఉంటుందన్న అభిప్రాయానికి అధికారులు వచ్చారు. దీంతో ఇప్పుడు కేటాయించినది కాకుండా వైద్యకళాశాల పక్కన కేటాయించే విధంగా ప్రభుత్వానికి మరో ప్రతిపాదన పంపించాలన్న నిర్ణయానికి అధికారులొచ్చినట్టు సమాచారం. దీంతో కొంత భూమిని గొర్రెల పెంపక కేంద్రం కోల్పోయిన నష్టం కొంత వరకు తగ్గే అవకాశముంది. ఈ రకంగా క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మార్పులు, చేర్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఇప్పటి వరకున్న పెంపక కేంద్రం భూమిని రోజురోజుకూ ఇతర అవసరాలకు కేటాయిస్తూ పోతుండటంతో జిల్లాలో పెంపకందారులు అధికంగానున్న ఇటువంటి చోట కొత్త మేలు రకంగా గొర్రెలు ఉత్పత్తి చేయడానికున్న అవకాశాలను కోల్పోయే పరిస్థితులు వస్తున్నాయన్న ఆందోళన మాత్రం సర్వత్రా వ్యక్తమవుతోంది. స్థల పరిశీలనలో పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం, తహశీల్దారు స్వర్ణలత, అహుడా అధికారి చిన్నయ్య, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ డెరెక్టరు, కలెక్టరు

సీఎంవో అధికారినంటూ టోకరా

అధికారులతో డబ్బులు గుంజేందుకు ప్రయత్నించిన ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) అధికారులమంటూ అధికారులతో డబ్బులు గుంజేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అనంతపురం పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కటకటాల వెనక్కు పంపారు. అనంతపురం డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు హయత్‌నగర్‌కు చెందిన రాయబండి సూర్యప్రకాష్ ఆచారి, దవులూరి ప్రసాద్‌లు తాగుడుకు బానిసయ్యారు. వ్యసనాల కోసమని సులువుగా డబ్బు సంపాదించేందుకు గానూ సీఎంవో అధికారులుగా అవతారమెత్తారు. తాము సీఎంవో కార్యాలయంలో పనిచేస్తున్నాం సమావేశాల నిర్వహణ ఖర్చు, మీడియా వారికి అయ్యే ఖర్చు ఇతర ఖర్చులున్నాయని జిల్లా అధికారులకు ఫోన్లు చేసి డబ్బు అడిగేవారు. గూగుల్, ఫోన్‌పేల ద్వారా డబ్బులు వేయాలని అధికారులను అడుగుతూ ఉండేవారు. ఈ రకంగా అనంతపురం జిల్లాలోనూ డిప్యూటీ ట్రాన్సుపోర్టు కమిషనర్ ఎన్.శివరాం ప్రసాద్‌కూ సీఎంవో అధికారినంటూ నమ్మబలికి ఫోన్ చేశారు. ఆయనకు అనుమానం వచ్చి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే రంగంలో దిగి విచారించగా వీరిద్దరి మోసాలు బయటపడ్డాయి. వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారిని విచారించగా వీరిపై ఇటువంటి కేసులు ఇది వరకే పది నమోదయినట్టు గుర్తించారు. ఈ కేసులో మొదటి నిందితుడు అయిన సూర్య ప్రకాష్ ఆచారిపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సిఐ రవి శంకర్‌రెడ్డి, ఎస్ఐ గౌస్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయం

ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి అన్నారు. శుక్రవారం ఉరవకొండ అర్బన్ పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో పటిష్ట చర్యలు చేపట్టే విధంగా పోలీసులు అప్రమత్తంగా ఉండే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేవిధంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో రైతులు ఆత్మహత్యలకు సంబంధించి వాటిని నిర్ధారించడానికి ప్రభుత్వం త్రీమెన్ కమిటీని నియమించిందని ఆ కమిటీలు పోలీస్ రెవెన్యూ వ్యవసాయ శాఖ మండల స్థాయి అధికారులు కమిటీ సభ్యులుగా ఉండి రైతు ఆత్మహత్యలు జరిగిన ప్రాంతాలకు వెళ్లి నిర్ధారించిన తర్వాత ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం అందించే రూ.7 లక్షలు పంపిణీ చేసే విషయంలో పోలీసు వ్యవస్థ శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ పనుల్లో నిమిత్తం అప్పులు చేసిన రైతులు మనోస్థైర్యాన్ని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అలాంటి రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ఎందుకు జిల్లావ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 3,575 సెల్ ఫోన్లను అధికారి రికవరీ చేయడం జరిగిందని రికవరీ చేసిన సెల్ ఫోన్ల ధర దాదాపు రూ.6 కోట్ల వరకు ఉంటుందన్నారు. అలాగే జిల్లా ప్రజల సంక్షేమం కొరకు అనంత ఈగల్ యాప్‌ను వీలైనంత త్వరలోనే ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కాగా మండల పరిధిలోని బూదగవి గ్రామంలోని సచివాలయాన్ని ఎస్పీ ఫక్కీరప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల సేవలను ప్రజలకు సకాలంలో అందే విధంగా ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా పర్యటించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు విగాధం కలిగించే విధంగా వ్యవహరించకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.



బూదగవిలో పర్యటిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి

ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ హక్కు

బిజెపి ద్రోహంపై మలిదశ ఉద్యమాలు.. విద్యార్థి సంఘాల జెఎసి నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీల అమలుకు మలిదశ ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందనివిద్యార్థి యుజన సంఘాల జెఎసి నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పట్ల వివక్ష చూపుతోందని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్టణం పర్యటనలో ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాటాన్ని నీరు గార్చడానికి ఒకవైపు నిర్బంధం, మరోవైపు రోడ్లు, భవనాలు, వంతెనలకు ప్రారంభోత్సవాలు చేయడం మినహా రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి పథకాలు ప్రకటించలేదన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వే జోన్, వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి, సెంట్రల్ యూనివర్సిటీకి శాశ్వత భవనాలు తదితర వాటి ప్రస్తావనే లేదన్నారు. ఇంత జరుగుతున్నా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు అనుసరిస్తున్న వైఖరి రాష్ట్ర ప్రయోజనాలకు, అభివద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా ఆయా పార్టీలు ముందుకొచ్చి రాష్ట్ర ప్రజల తరపున గళం విప్పాలని, బిజెపి నిరంకుశ విధానాలను, రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని ఎలుగెత్తి చాటాలన్నారు. బిజెపి వ్యతిరేక శక్తులన్నీ ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి మలిదశ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్రయాదవ్, ఎన్ఎస్‌యుఐ అధికార ప్రతినిధి పులిరాజు, ఎపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘంద్ర, బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసి.సురేష్, ఎఐఎస్ఎ యూనివర్శిటీ కార్యదర్శి రాజునాయక్, బిసి విద్యార్థి సంఘం నాయకులు జయపాల్‌యాదవ్, ఎస్ఎఫ్ఐ యూనివర్శిటీ కార్యదర్శి వీరుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జెవివి ధ్యేయం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులందరూ శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని కలిగి ఉండాలని, తద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవచ్చని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు, మండల స్థాయి పరీక్ష శుక్రవారం కెఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ పరీక్ష విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. విద్యార్థులు సైన్స్ టాలెంట్ టెస్ట్‌ల్లో పాల్గొన్నారన్నారు. జిల్లా స్థాయి చెకుముకి పరీక్షకు ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఏ మేరకు సాక్షాధారాలు ఉన్నాయో ఆ మేరకు నమ్మడం, సమస్యకు శాస్త్రీయంగా ఆలోచించి పరిష్కారాన్ని కనుకొనడమే శాస్త్రీయ దృక్పథమని తెలిపారు. అశాస్త్రీయ భావాలను విడనాడాలన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన కలిగించడానికి, ప్రజలలో మూఢ విశ్వాసాలను తొలగించడానికి జెవివి మూడు దశాబ్దాలుగా దృషి చేస్తోందన్నారు. అనంతరం మండల స్థాయి చెకుముకి ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. జెవివి జిల్లా అధ్యక్షులు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు జిల్లాలో 250 పాఠశాలలో, 30 మండలాల్లో జరిగిందన్నారు. మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులు జిల్లాస్థాయి (పరీక్ష) డిసెంబర్ 11వ తేదిన నిర్వహించే పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమతా నాయకురాలు డాక్టర్ ప్రసూన, కెఎస్ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కిరణ్‌మయి, ఉపాధ్యాయురాలు చాయ, జెవివి నగర అధ్యక్ష కార్యదర్శులు గురిగాని ముత్యాలన్న, గాంగేనాయక్, కోశాధికారి రామిరెడ్డి, కళాకారుడు లక్ష్మినారాయణ, నాయకులు ప్రసాద్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

నేటి నుంచి మొబైల్ ఆధార్ సేవలు

పుట్లూరు : మండలంలో నేటి నుంచి 25వ తేదీ వరకు ఏర్పాలు చేయనున్న మొబైల్ ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న తక్కల్లపల్లి, 23న అరకటివేముల, 24న చెర్లోపల్లి, 25న కందికాపుల సచివాలయాల్లో మొబైల్ ఆధార్ సర్వీసును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రాయదుర్గం : పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19, 23, 25వ తేదీల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పని చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న సర్వసభ సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్ష ఈనెల 21న మండల సర్వసభ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వందశాతం పన్నుల వసూళ్లకు చర్యలు

తాడిపత్రి : తాడిపత్రి పురపాలక సంఘం పరిధిలోని ఆస్తి, నీటి కొళాయి పన్నులు వందశాతం వసూళ్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా ఆయా వార్డు అడ్మిన్ సెక్రటరీలను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల పన్నులను వెంటనే వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, అధికారులు, తదితరుల పాల్గొన్నారు.

నేడు అర్బన్ హెల్త్ సెంటర్ల ప్రారంభం

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 2వ రోడ్డు, కోర్టు రోడ్డు, బుడ్డప్ప నగర్‌లో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్లను శనివారం ప్రారంభించనున్నట్లు కమిషనర్ కె.భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ మహమ్మద్ వసీం హాజరుకానున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ షర్మిల, సూపర్‌వైజర్ దస్తగిరమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడంలో అంగన్‌వాడీల పాత్ర చాలా కీలకమైందన్నారు. ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో బాల్య వివాహాలు, బాలలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈనేపథ్యంలో బాల్య వివాహ నిరోధక చట్టం 2006 మేరకు బాల్యవివాహాలను లేని మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా బాల్యవివాహాల వల్లకలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే మాతాశిశు మరణాలను తగ్గించాలని, బాలికల విద్యను ప్రోత్సహించాలని, భ్రూణ హత్యలను నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ఉమాశంకర్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ బాలాజీ, టీం సభ్యులు లావణ్య, అశ్వణీ, నాగలక్ష్మి, విఆర్‌ఒలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

E.P.No.10/2022 in O.S.No.261/2017

Between:
బి.ఆదినారాయణ ...పిటీషనర్/డి. హెచ్.ఆర్
మరియు
పి.నారాయణస్వామి ...రెస్పాండెంటు/డి. హెచ్ఆర్

నోటీసు టు జె.డిఆర్

To,
పి.నారాయణస్వామి తండ్రి:పి.పుల్లయ్య, డోర్‌నెం.ఎంఐజి 68, ఎ.పి.హెచ్.బి. కాలనీ, అనంతపురం.

పై నెంబరు ఇ.పి.లో జె.డిఆర్ అయిన మీ హాజరు నిమిత్తము 23-11-2022వ తేది ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

పి.నాగిరెడ్డి, డి. హెచ్ఆర్ అడ్వకేట్, అంతపురం.

IN THE COURT OF THE DISTRICT AND SESSIONS JUDGE:ANANTAPUR

Original Petition No.59/2022

(In the matter of Guardianship of BOYA CHAITHANYA TEJA)

Between:
Boya Durga ...Petitioner
And
Who may so ever Concern ...Respondants

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై తెల్పిన బోయ చైతన్య తేజ మైనరుకు, తల్లి బోయ ఎర్రమ్మ W/o ఆంజనేయులు మరణించినది. అందులకు పై తెల్పిన వాది మైనరు అయిన బోయ చైతన్య తేజకు గార్డియన్‌గా వుండుట కొరకు పై తెల్పిన కోర్టు అందు అర్జీ దాఖలు చేసినది. కావున సదరి కేసులో ఎవరికైన ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల వారు పై కోర్టు అందు 02-12-2022వ తేదిన ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకోవలసినదిగా కోర్టువారు వుత్తర్వులు జారి చేసినారు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఎస్.బి. సుబ్బయ్య, అడ్వకేట్
అనంతపురం, సెల్:9393725919.

నిండుగా నీరు.. ఆయకట్టు బీడు..

నీటి వినియోగంలో ప్రభుత్వం విఫలం : మాజీ మంత్రి కాలవ



ధ్వంసమైన డిస్ట్రిబ్యూటరీ కాలువను పరిశీలిస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లలో పూర్తిస్థాయిలో నీరు ఉన్నా ఆయకట్టు భూములు మాత్రం బీళ్లుగా దర్శనమిస్తున్నాయని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గుమ్మఘట్ట టిడిపి నాయకులు, రైతులతో కలిసి శుక్రవారం భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ దుస్థితి, కలుగోడు చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ జిల్లాలోని దాదాపు 1100 చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయన్నారు. వాటి కింద రబీలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించే అవకాశమున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా పంట కాలువల మరమ్మతులకు పైసా నిధులు విదిల్చకుండా రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. కాలువల మరమ్మతులకు, నీటి తీరువాకు లంకె పెట్టడం తగదన్నారు. గుమ్మఘట్ట మండలం కలుగోడు చెరువు చాలా ఏళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నిండిందన్నారు. చెరువులో నీరున్నా ఆయకట్టుకు ఎందుకు వదలడం లేదని ప్రశ్నించారు. గుమ్మఘట్ట వైసిపి జెడ్పిటిసి టెంకాయల మహేష్ కలుగోడు చెరువు తూమును మూసేయడంతోపాటు పంట కాలువలను ధ్వంసం చేసి ఆనవాళ్లు లేకుండా ఆక్రమించాడని ఆరోపించారు. వారి స్వార్థం వల్లే ఆయకట్టు బీడుగా మారిందని ధ్వజమెత్తారు. రైతు నోట్లో మట్టికొట్టే దుర్మార్గమైన చర్యలకు ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బాధ్యత వహించడం బాధాకరమన్నారు. వెంటనే జిల్లాలోని ఆయకట్టు భూములకు నీరివ్వాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నాగరాజు, బిటిపి మాజీ ఛైర్మన్ కాలవ నాగరాజు, జిల్లా రైతు అధికార ప్రతినిధి దానవేంద్ర, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, నాగరాజు, మాజీ సర్పంచులు మోహన్‌రంగ, గంగాధర, తిప్పేస్వామి, ఎంపిటిసి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధి

మేయర్ మహమ్మద్ వసీం



భూమిపూజ చేస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో శరవేగంగా రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధి సాగుతోందని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శుక్రవారం నగరంలోని 13, 20, 21వ డివిజన్ల పరిధిలో చేపట్టనున్న రోడ్లు, డ్రెయినేజీ పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే సిఎం జగన్ సహకారంతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కృషితో రోడ్ల అభివృద్ధికి తమ ప్రాలకవర్గం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నగరంలో 15వ ఆర్థిక నిధులను రూ.18.92 కోట్లతోపాటు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ప్రధాన రహదారుల అభివృద్ధితోపాటు అన్ని డివిజన్ల పరిధిలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌ఇ నాగమోహన్, కార్పొరేటర్లు చంద్రలేఖ, లావణ్య, బాబా ఫక్రుద్దీన్, కమల్‌భూషణ్, సైపులా బేగ్, దేవి, నాగమణి, సుజాత, జయలలిత, నాయకులు సాకే కుళ్లాయిస్వామి, చిన్ని, గంగాధర్, యోగి, ఖాజా, డిఇ చంద్రశేఖర్‌తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం : ఎస్ఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఆసన్నమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ, సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉరవకొండలోని సిపిఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ మండల 2వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బైజూస్ ఒప్పందాన్ని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉరవకొండలో నూతన ఐటిఐ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. మండల పరిధిలోని చిన్నముష్టూర్ మోడల్ స్కూల్ కు రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్ పాఠ్యపుస్తకాలను అందజేయాలని కోరారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా రజనీకాంత్, ఉపాధ్యక్షులుగా మహేష్, ఆకాష్, వినోద్, కార్యదర్శిగా సింహాద్రీనాయక్‌తోపాటు 20 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమంలో నూతన మండల కమిటీ సభ్యులు అశోక్, తిప్పాయిస్వామి, చిదానంద, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

చైర్ పర్సన్ ఉమామోహన్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి

రాయదుర్గం : జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవులు పాలువ శ్రీనివాసులు, చంద్రశేఖర్, గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్ఎం మోహన్‌రెడ్డి, గ్రంథాలయ అధికారిణి ఆదిలక్ష్మి, బద్రీనారాయణ, ఎర్రన్న, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని ఎల్ఎం బాలుర పాఠశాలలో గ్రంథాలయ అధికారి హెచ్.రామాంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలతోపాటు క్విజ్, చిత్రలేఖనం, వకత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, గ్రంథాలయ సిబ్బంది సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకే విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయ అధికారి వై.ప్రతాపరెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉరవకొండలోని జడ్పీహెచ్ సెంట్రల్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. మహానటీ.. ఇక చాలు నీ నటన..

అవినీతిపై పరిటాల సునీత గ్లోబెల్ ప్రచారం - ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'అమ్మా.. మహానటి.. ఇక చాలు అమ్మా.. నీ నటన తగ్గించుకో..' అంటూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక రోడ్లు, భవనాలు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మా మహానటి.. జిల్లా మంత్రిగా ఉన్న సమయంలో నారా లోకేష్ అనే ఒక నామినేటెడ్ రాజకీయ నాయకుడు, పరిశ్రమల మంత్రిగా ఉండగా వీరు చేసుకున్న అనేక చీకటి ఒప్పందాలతో ప్రభుత్వ భూములను వివిధ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. తాము పరిశ్రమలు తీసుకొచ్చాం.. వైసిపి వచ్చిన తర్వాత పరిశ్రమలన్నీ వెళ్లిపోతున్నాయంటూ గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతపురం సరిహద్దుల్లో రాప్తాడు గ్రామంలో వాల్మీకులు సాగు చేసుకుంటున్న భూములను ఒక్క రూపాయి పరిహారం ఇవ్వకుండా పేజ్ ఇండస్ట్రీస్ అనే సంస్థకు కట్టబెట్టారన్నారు. దాదాపు 140 కోట్ల విలువ చేసే 28 ఎకరాల భూమిని కేవలం రూ.2.80కోట్లకు ఇచ్చారన్నారు. పదేపదే జాకీ వస్తోంది జాకీ పరిశ్రమ తెచ్చామని చెబుతున్న మీరు జాకీ సంస్థకు అనుబంధంగా ఉన్న సంస్థ పేజ్ ఇండస్ట్రీస్‌ను అప్పటి పప్పు నాయుడు, మీరూ కలిసి చేసుకున్న చీకటి ఒప్పందంలో భాగంగా ఎంఓయూ లేని కంపెనీలకు అప్పనంగా భూములు కట్టబెట్టారన్నారు. బేరం కుదరని కారణంగా ఎంఓయూ జాబితాలోని 14 కంపెనీలకు భూములు కేటాయించలేదన్నారు. దీంతో పరిశ్రమ రాకుండా పోయిందన్నారు. అయితే ఇప్పుడు పరిశ్రమ వెనక్కి వెళ్లడానికి తామే కారణమంటూ 'కమ్మ'ని మాటలు చెబుతున్నారన్నారు. మీ మాటలను ఎవరూ నమ్మరన్నారు. అంతేగాకుండా జాకీ కంపెనీ వస్తోందంటూ చిన్మయానగర్, రాప్తాడులో దాదాపు 200 ఇళ్లు కూల్చేశారని గుర్తు చేశారు. వారందరికీ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత జగనన్న కాలనీల్లో ఇంటిస్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. అలాగే మీరు మంత్రిగా ఉన్న సమయంలో పంపిణీ చేసిన రంజాన్ తోఫా, చంద్రన్న కానుక సరుకులను ఏయే కంపెనీలకు ఇచ్చిందో వాటిమీద సీబీఐ, సీఐడీ విచారణ చేయించి నిజాయితీని నిరూపించుకోవాలని సూచించారు. మీ హయాంలో మూయించిన రామగిరి బంగారు గనులు తెరిపించేందుకు టెండర్లు పిలిచామన్నారు. ఇప్పటికైనా పరిటాల సునీత అవాస్తవాలను చెప్పడం మానుకోవాలని, లేనిపక్షంలో మరోసారి ఘోరంగా దెబ్బతింటావని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రాప్తాడు వైసిపి మండల కన్వీనర్ శేఖర్, మార్కెట్ యార్డు ఛైర్మన్ గోపాల్‌రెడ్డి, వైసీపీ యూత్ కన్వనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

కౌలు రైతులను ఆదుకోవడంలో విఫలం

కౌలురైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య

బొమ్మనహాల్ : కౌలు రైతులను ఆదుకోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని కౌలు రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని తారకాపురంలో ఈనెల 21, 22వ తేదీల్లో చిలకలూరిపేటలో నిర్వహించనున్న కౌలు రైతుసంఘం మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కణేకల్, బొమ్మనహాల్ మండలాల్లో దాదాపు 5వేల మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. వీరిలో కేవలం 210 మందికి మాత్రమే ప్రభుత్వం కౌలు కార్డులు మంజూరు చేసిందన్నారు. ఎవరు సొంత భూమి చేస్తున్నారు.. ఎవరు కౌలు భూమి చేస్తున్నారు.. అని తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఒక్కొక్క కౌలు రైతు మిరప పంట సాగు చేయడానికి రూ.50వేల వరకూ పెట్టుబడి పెడుతున్నారన్నారు. కానీ పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రావడం లేదన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కావున పెద్ద ఎత్తున మహాసభల్లో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు నాగరాజు, సుంకన్న, భాస్కర్, రవి, గురుస్వామి, తారకాపురం, గోవిందవాడ, కళ్లహోళ రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత

విప్ కాపు రామచంద్రారెడ్డి



భూమిపూజ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం : సిఎం జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సన్మాన ప్రాధాన్యత కల్పిస్తోందని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 1, 3, 4, 11వ వార్డుల్లో రూ.40 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటి వరకు పట్టణంలో ఆరు వార్డుల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. ఆయా వార్డుల్లో ప్రజల విజ్ఞప్తి మేరకు ఒక్కో వార్డుకు రూ.10 లక్షల చొప్పున పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నాలుగు వార్డుల్లో సిమెంట్ రోడ్డు పనులు మొదలుపెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు సభ్యులు చెన్నవీరస్వామి, శ్రీనివాసరెడ్డి, ప్రశాంతి, నాగమణి, గోవిందరాజులు, పద్మజ, సంజీవ, గోవిందా, ఫక్రుద్దీన్, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామమూర్తి, అసిస్టెంట్ ఇంజినీర్ గోపీనాథ్, వైసిపి నాయకులు శివ, నిజాముద్దీన్, దివాకర్, కృష్ణమూర్తి, రాము, కాంట్రాక్టర్ ఆర్‌టి లక్ష్మీకాంతరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గార్బేజ్ కార్మికులకు ఉపాధి కల్పించాలని వినతి



మేయర్‌తో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

అనంతపురం కార్పొరేషన్ : గార్బేజ్ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో మేయర్ మహమ్మద్ వసీంకు కార్మికులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, కె.నాగభూషణం మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి ఇంటింటి చెత్త సేకరణ చేసుకుంటూ ప్రజలు ఇస్తున్న రూ.5, రూ.10తో గార్బేజ్ కార్మికులు జీవనం సాగించేవారన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్లాప్ ఆటోల వల్ల వారు ఉపాధి కోల్పోయి నడిరోడ్డు మీద ఉండే పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంపై ఇప్పటికే మేయర్‌తోపాటు కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి విన్నవించామన్నారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో 25 మందికి ఉపాధి కల్పించి, రెండు నెలల జీతం కూడా అమలు చేసి రేపటి నుంచి విధులకు కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గార్బేజ్ కార్మికుల సమస్య పరిష్కరించినందుకు అధికారులు, నగరపాలక సంస్థ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యల వెల్లువ

కుందుర్పి : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కమలమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సమస్యలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయాలని, గ్రామాల్లో రోడ్లు వేయాలని, కల్వర్టులు నిర్మించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చూడాలనే తదితర సమస్యలను లేవనెత్తారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సోమనాథ్, శ్రీలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు ముజీవుల, ఎంపిడిఒ నారాయణస్వామి, తహశీల్దార్ షాబుద్దీన్, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు పురోభివృద్ధికి కృషి

బెలుగుప్ప : సహకార బ్యాంకు పురోభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని సహకార బ్యాంకు సింగిల్‌విండో అధ్యక్షుడు బి.శివలింగప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార బ్యాంకులో 69వ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో కూడా సహకార రంగం కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు.అనంతరం బెలుగుప్ప, గుండ్లపల్లి, నక్కలపల్లి, ఆవులెన్న, తగ్గుపర్తి గ్రామాల్లో గోదాములు నిర్మించేందుకు తహశీల్దార్ ఈశ్వరయ్యశెట్టి స్థలాలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణయ్య, ఎఒ పృథ్వీసాగర్, అగ్రి బోర్డు ఛైర్మన్ పి.శ్రీనివాసులు, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాతన గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, శివనాయక్, సింగిల్‌విండో డైరెక్టర్లు, సిఇఒ పాండు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కనిపించకుండా పోయిన వ్యక్తి మృతి

గుంతకల్లు : రెండు రోజుల క్రితం అదశ్యమైన పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన షాకీర్ బాషా(30) శుక్రవారం పట్టణ శివారులోని బళ్లారి రహదారి వద్ద ఉన్న హంద్రీనీవా కాలువలో శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిలక్‌నగర్‌కు చెందిన షాకీర్ బాషా రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయాడని తల్లిదండ్రులు రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై నరేంద్ర తెలిపారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం పట్టణ శివారు లోని బళ్లారికి వెళ్లే జాతీయ రహదారి వద్ద ఉన్న హంద్రీనీవా కాలువలో వ్యక్తి మృతదేహన్ని స్థానికులు గుర్తించి వజ్రకరూరు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే అక్కడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

దుకాణం దగ్ధం

రాయదుర్గం : పట్టణంలోని లక్ష్మీబజార్‌లో ఉన్న మారుతి మెడికల్ షాప్‌లో శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించింది.షాపు యజమాని ఆనంద్‌బాబుకు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లాడు. ఈ సమయంలో దుకాణంలో నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే యజమానితోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి వెంటనే మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దుకాణంలో ఉన్న మందులు, ఫర్నిచర్, ఫ్రిడ్జ్, ఇతర ఫర్నిచర్, వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఫలితంగా రూ.18 లక్షల ఆస్తి నష్టం కలిగినట్లు దుకాణం యజమాని ఆనందబాబు వాపోయాడు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అగ్నిమాపక దళ అధికారి ఆదిశేషయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి : మండలంలోని ఎంగిలిబండ గ్రామ సమీపంలో 67వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తొండపాడు కు చెందిన జయకృష్ణ పని నిమిత్తం ద్విచక్రవాహనంలో గుత్తికి బయలుదేరాడు. అయితే వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం ఎంగిలిబండ గ్రామ శివారులో బస్టాప్ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ జయకృష్ణని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పంటకోత ప్రయోగం

నార్పల : మండల పరిధిలోని చామలూరు రెవెన్యూ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా ఆధ్వర్యంలో శుక్రవారం పత్తి పంటకోత ప్రయోగం నిర్వహించారు. పంట కోత ప్రయోగంలో నూరు చదరపు మీటర్లలో 2420 గ్రాములు దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, వీఆర్వో ప్రభావతి, విహెచ్ఎ అజయ్‌కుమార్, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జగనన్న బాటలో నడుద్దాం..: ఎమ్మెల్యే పద్మావతి

నార్పల : మనందరం జగనన్న బాటలో నడిస్తే సంక్షేమ పథకాలన్నీ మన ఇంటికి చేరుతాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని బండ్లపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్ఎంఇ డైరెక్టర్ రఘునాథరెడ్డి, ఎంపిపి నాగేశ్వరావు, తహశీల్దార్ నారాయణస్వామి, ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ, వ్యవసాయ అధికారి ముస్తఫా, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీబీ జైనబ్బీ దర్గా గుంబజ్ ప్రారంభం

ఉరవకొండ : పట్టణంలో వెలిసిన పాక్ దామన్ హజ్రతా సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ రహంతుల్లా అలైహా దర్గా షరీఫ్ నూతన గుంబజ్‌ను ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా కమిటీ ఏర్పాటు చేసిన అన్నదానంలో కేశవ్ పాల్గొన్నారు. కాగా దర్గా అభివృద్ధికి ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డి, తనయుడు వై.భీమరెడ్డి రూ.3.50 లక్షల నగదును విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంలో జెవివి పాత్ర కీలకం

గుత్తి : ప్రజలను చైతన్య పరచడంలో జన విజ్ఞాన వేదిక కీలక పాత్ర పోషిస్తోందని విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ కృష్ణగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బి.రవినాయక్, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం. రంగన్న, మండల కార్యదర్శి పి.వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురుశంకర్, నాయకులు శ్రీధర్‌గౌడ్, దేశాయి నాగరాజు, శ్రీసాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జయ రంగారెడ్డి, ప్రిన్సిపల్ కాంతారెడ్డి, డైరెక్టర్ ముత్యాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్ పోటీలకు పివికెకె విద్యార్థులు

అనంతపురం : స్థానిక రుద్రంపేట వద్ద ఉన్న పివికెకె ఐ.టి డిప్లొమా కళాశాలలో ఇఇఇ 3వ సంవత్సరం చదువుతున్న బి.లక్ష్మణ్, సి.సతీష్‌కుమార్, ఎస్.జశ్వంత్‌నాయుడు, ఎకెఎండి తాహీర్ తయారు చేసిన నమూనా రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఫెస్ట్‌కు ఎంపికైనది. వీరు తయారు చేసిన నమూనాను 16, 17 తేదీల్లో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రీజినల్ పాలిటెక్నిక్ ఫెస్ట్‌లో ప్రదర్శించారు. ఈమేరకు ప్రతిభ కనబరిచిన కళాశాల ఛైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ జిఎన్ఎస్ వైభవ్, కళాశాల కోశాధికారి పల్లె సింధూరారెడ్డి, కళాశాల యాజమాన్య ప్రతినిధి కె.శ్రీకాంత్‌రెడ్డి, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సుబ్బారావు, డిప్లొమా ఇఇఇ విభాగాధిపతి జయలక్ష్మి అభినందించారు.

మరపురాని మహానటుడు సూపర్‌స్టార్ కృష్ణ

అనంతపురం : మరపురాని మహానటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని పలువురు నేతలు కొనియాడారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని వైసిపి కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు అనంత చంద్రారెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నటుడుగా, రాజకీయనేతగా, మానవతావాదిగా కృష్ణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గౌస్‌బేగ్, నరసింహ్మలు, మారుతీనాయుడు, కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, రహంతుల్లా, ఇషాక్, చింతకుంట మధు, రాధాకృష్ణ, వడ్డే రామచంద్ర, అరవిందరెడ్డి, ఎండి హుస్సేన్, దేవాంగం రామయ్య, జిలాన్, అంజాద్‌ఖాన్, తలారి నవీన్‌కుమార్, కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి : వ్యకాసం



మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

శింగనమల : ఈనెల 21, 22వ తేదీల్లో జిల్లాలోని వజ్రకరూరు మండలంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను సక్రమంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని, కూలీల నిధులను దళారీలకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆపాలని డిమాండ్ చేశారు. వంద రోజులు పనులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, ప్రతి జాబ్‌కార్డుకూ రూ.600 కూలి పడేలా చూడాలని, కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలి, బిజెపి ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ నెంబర్ 17000(31)ను రద్దు చేయాలి, రెండు పూటల పని రద్దు చేయాలని, వేసవి అలవెన్స్ ఇవ్వాలని, పాత పద్ధతిలోనే పనులు కల్పించాలని, ప్రమాదంలో చనిపోయిన కూలి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారంపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సలకంచెరువు సుంకన్న, అధ్యక్షులు తరిమెల రామాంజనేయులు, సుంకన్న, కోశాధికారి ఎర్రిస్వామి, నాగేంద్ర, ఆంజనేయులు, రామాంజనేయులు, ఆంజనేయులు, బాలరాజు, శంకర, రమేష్, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.